thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 73 | జగిత్యాల | ఆదివారం | 7 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### భారీ స్కోరు దిశగా భారత్




11



# ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం

### అష్టదరిద్రులు అడ్డం పడ్డా అభివృద్ధి ఆగదు

- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- కోహెడ పండ్ల మార్కెట్ శంకుస్థాపనలో సీఎం

# బ్లూ కాలర్ ఉద్యోగాలపై దృష్టి పెట్టాలి

### ఏఐతో వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రమాదం..



## త్వరలో మరో ఐదు వేల పోలీసు ఉద్యోగాలు

### హైడ్రాకు హిట్లరే స్ఫూర్తి!

- చెరువుల రక్షణకే ప్రతిష్టాత్మక వ్యవస్థ
- ధనికుల ఆక్రమణలు అడ్డుకునేందుకే ఈ దళం
- పొరుగు రాష్ట్రాలతో మాకు పోటీ లేదు.. జపాన్, చైనాతోనే నేరుగా తలపడుతున్నాం
- భారీ నష్టమైనా ఈవీలకే మా తొలి ప్రాధాన్యం
- కామన్ సెన్స్ తోనే పాలన.. కింది స్థాయి సిబ్బంది సలహాలకూ ప్రాధాన్యం
- హిందూ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

వివరాలు 2వ పేజీలో

చెరువులను కబళిస్తున్న బడాబాబుల ఆట కట్టించేందుకే అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో 'హైడ్రా' వ్యవస్థను తీసుకువచ్చానని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలు ఆక్రమిస్తే మానవతా దృక్పథంతో చూడొచ్చని, కానీ ధనికులు విలాసాల కోసం ప్రకృతిని నాశనం చేస్తే సహించేది లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. బెంగళూరు వేదికగా జరిగిన 'ది హిందూ హడిల్' జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర పాలన, భవిష్యత్ ప్రణాళికలపై తనదైన శైలిలో మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు దేశంలోనే అత్యుత్తమ మైన 'ఈగిల్ ఫోర్స్'ను రంగంలోకి దించామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో పొరుగు రాష్ట్రాలతో తమకు ఎలాంటి పోటీ లేదని, చైనా, జపాన్ లాంటి దేశాలతోనే నేరుగా తలపడుతున్నామని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, యువత నైపుణ్యాలు పెంచుకుని బ్లూ కాలర్ కొలువులపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. పాలకుడిలా కాకుండా.. ఒక సామాన్యుడిలా 'కామన్ సెన్స్' తోనే తాను పరిపాలన సాగిస్తున్నానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

*- ఉద్యమ కెరటం, హైదరాబాద్*



# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### ప్రధాని మోదీ కీలక భేటీ

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రధాన ఆర్థిక సలహా మండలి సభ్యులతో కీలక సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై తగ్గించే మార్గాలతో పాటు దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో 'ఈజ్ ఆఫ్ లివింగ్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సంస్కరణలను వేగవంతం చేయడం, ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం అంశాలు చర్చకు వచ్చాయి.

వివరాలు 4వ పేజీలో

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!

- ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్యత వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే

నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది.




వివరాలు 4వ పేజీలో





4

# 26.51 లక్షల టన్నులు

### సింగరేణిలో కనిష్టానికి బొగ్గు నిల్వలు!

# అప్రమత్తంగా ఉండండి!

### వర్షాలు, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

సీఎం జిల్లాల పర్యటనలకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన

రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం ఆయన సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలతో పాటు ధాన్యం కొనుగోళ్లు, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలు, త్వరలో జరగనున్న నీట్ పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు.





# చల్లబడ్డ భాగ్యనగరం!

- ఉక్కపోత నుంచి నగరవాసులకు భారీ ఉపశమనం
- హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి కుండపోత వాన

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

- నీళ్లు లేక 49మంది మృత్యువాత



4

# రాష్ట్రంలో ఇప్పుడూ కేటీఆర్ పాలనే



- కాంగ్రెస్ నేతలు, సీఎం బంధువుల కనుసన్నల్లో భూములు స్వాహా
- పేదల ఇళ్లు కూల్చి పెద్దలకు కట్టబెడుతున్న హైడ్రా
- పవన్ కల్యాణ్ కొన్నది శిఖం భూమే
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

వివరాలు 2వ పేజీలో

# విషనాగులతో జాగ్రత్త!



- రాష్ట్ర పరిస్థితులు తెలియని నాలుగు ఫీట్ల నాయకులతో ముప్పు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మలేషియాలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

వివరాలు 2వ పేజీలో

చురకలు


# విషనాగులతో జాగ్రత్త!

**రాష్ట్ర పరిస్థితులు తెలియని నాలుగు ఫీట్ల నాయకులతో ముప్పు**

**సీఎంగా కేసీఆర్ తిరిగి రావడం నూటికి నూరు శాతం ఖాయం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**కౌలాలంపూర్, జూన్ 6:** రాష్ట్ర పరిస్థితులు ఏమీ తెలియని నాలుగు ఫీట్ల నాయకులు అభివృద్ధి, నీళ్లు, నిధుల గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాముల్లా బుసకొడతాయని, అలాంటి విషనాగులతో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. 2028లో రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం వంద శాతం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్ లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేటీఆర్ పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. మలేషియాలోని కౌలాలంపూర్ నగరంలో ఉన్న మట్టార్ కన్వెన్షన్ సెంటర్ లో శనివారం మలేషియా తెలుగు అసోసియేషన్, బీఆర్ఎస్ ప్రవాస శాఖ సంయుక్తంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కరెంట్ కోతలతో తల్లడిల్లిందన్నారు. ఆయిల్, అణ్వాయుధాలు ఉన్నవాడు కాదు, సరైన ఆలోచన ఉన్నవాడే అసలైన లీడర్ అని స్పష్టం చేశారు. నేటి యువతరం (జెన్–జీ) సరికొత్త శక్తితో, ఉత్సాహంతో ఉరకలేస్తోందని కొనియాడారు. ఒకనాటి వలసలు, కరువుల తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ దేనని కేటీఆర్ స్పష్టం చేశారు. మలి విడత ఉద్యమానికి నాయకత్వం వహించి, సబ్బండ వర్గాలను కలుపుకుపోయి రాష్ట్రాన్ని సాధించారన్నారు. దేశంలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేశారు. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇవ్వడంతో పాటు, నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ మహమ్మారిని తరిమికొట్టిన ఘనత కేసీఆర్ నాయకత్వానికే దక్కుతుందన్నారు. డెబ్భై లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. మలేషియా స్ఫూర్తితోనే విత్తనాలు తీసుకువచ్చి రాష్ట్రంలో పామాయిల్ విప్లవం సృష్టించామని వెల్లడించారు. తెలంగాణను తిరిగి అభివృద్ధి పథంలో నిలిపే శక్తి కేసీఆర్ కు మాత్రమే ఉందని కేటీఆర్ తేల్చి చెప్పారు. ఆయన తిరిగి రాగానే భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందిన దేశాల తరహాలో ఇరవై నాలుగు గంటల పాటు స్వచ్ఛమైన మంచినీటిని నిరంతరం సరఫరా చేయాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఖండాలు దాటినా మాతృభూమిని మర్చిపోకుండా సంబరాలు చేసుకుంటున్న ప్రవాస తెలంగాణ బిడ్డలను కేటీఆర్ అభినందించారు. ఇంత అద్భుతమైన చరిత్ర, సంస్కృతి కలిగిన మనమంతా.. నేను తెలంగాణ బిడ్డను అని సగర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. ప్రవాస భారతీయులంతా స్థానిక సంస్కృతితో కలిసిమెలిసిపోయి విజయాలు సాధించాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

# పకడ్బందీగా ఏర్పాట్లు!

**ఈనెల 8న నాంపల్లిలో ఆస్తమా రోగులకు చేప ప్రసాదం పంపిణీ**

**ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొన్నం, శ్రీహరి**

**క్యూలైన్లలో ఫ్యాన్లు, కూలర్లు, సీపీఆర్ బృందాల ఏర్పాటు**



**హైదరాబాద్, జూన్ 6:** ఈనెల 8వ తేదీ మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో అస్తమా వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేసే చేప ప్రసాదం ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పర్యవేక్షించారు. ఈసారి రాత్రి తొమ్మిది గంటలకు పంపిణీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మత్స్య అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. క్యూలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వేసవి ఉక్కపోత తీవ్రంగా ఉన్నందున క్యూలైన్ల వద్ద ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్ల మధ్యలో అత్యవసర వైద్య సాయం కోసం సీపీఆర్ బృందాలను ఉంచాలని ఆదేశించారు. అంబులెన్సులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు వివిధ విభాగాల అధికారులు వాట్సాప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షించాలని, ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోని కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు, జేబు దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా మైకుల ద్వారా స్పష్టంగా ప్రకటనలు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని, అగ్నిమాపక శకటాలను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడటంతో పాటు, స్వచ్ఛంద సంస్థలు ఎప్పటిలాగే ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

# బ్లూ కాలర్ ఉద్యోగాలపై దృష్టి పెట్టాలి


- బ్లూ కాలర్ ఉద్యోగాలపై యువత దృష్టి పెట్టాలి
- త్వరలో మరో ఐదు వేల పోలీసు ఉద్యోగాలు
- హైడ్రాకు హిట్లరే స్ఫూర్తి!
- చెరువుల రక్షణకే ప్రతిష్టాత్మక వ్యవస్థ
- ధనికుల ఆక్రమణలు అడ్డుకునేందుకే ఈ దళం
- పొరుగు రాష్ట్రాలతో మాకు పోటీ లేదు.. జపాన్, చైనాతోనే నేరుగా తలపడుతున్నాం
- భారీ నష్టమైనా ఈవీలకే మా తొలి ప్రాధాన్యం
- కామన్ సెన్స్ తోనే పాలన.. కింది స్థాయి సిబ్బంది సలహాలకూ ప్రాధాన్యం
- హిందూ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




**హైదరాబాద్, జూన్ 6:** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయ రంగాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడ్డాయని ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. యువతరం వాటికి ప్రత్యామ్నాయమైన బ్లూ కాలర్ జాబ్స్ వైపు మళ్లాలన్నారు. ఇందులో భాగంగానే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు, పాత సిలబస్ తో ఉన్న ఐటీఐలను అత్యాధునిక టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్ గ్రేడ్ చేశామని వివరించారు. నిరుద్యోగుల సమస్యలు తీర్చే క్రమంలో యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. పదిహేను నెలల్లోనే 67,760 ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో మరో 5 వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని ప్రకటించారు. చెరువులను పేదలు ఆక్రమిస్తే మానవతా దృక్పథంతో అర్థం చేసుకోవచ్చని, కానీ ధనికులే జలాశయాలను ఆక్రమించి విలాస భవనాలు నిర్మిస్తుండటం వల్లే 'హైడ్రా'ను ఏర్పాటు చేశానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైడ్రా అనేది అడాల్ఫ్ హిట్లర్ కు అత్యంత ఇష్టమైన పదమని, ఆయన నుంచే స్ఫూర్తి పొంది ఈ వ్యవస్థను తెచ్చానన్నారు. మూడు వేల మంది మాజీ సైనికులతో హైడ్రా ఏర్పాటు చేశామని, ఇప్పుడు చెరువులను ఆక్రమించేందుకు ఎవరూ సాహసించడం లేదన్నారు. అలాగే యువతను పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు దేశంలోనే అత్యుత్తమమైన 'ఈగిల్ ఫోర్స్'ను రంగంలోకి దింపామని వెల్లడించారు. గతంలో రాష్ట్రంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారని, తాము అధికారంలోకి వచ్చాక 25 వేల రైతు కుటుంబాలకు చెందిన రుణాలను మాఫీ చేశామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం 2024–25 సంవత్సరంలో తెలంగాణలో రైతు ఆత్మహత్యలు లేవన్నారు. కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించి చేతులు దులుపుకుంటోందని, తాము మాత్రం ధాన్యానికి అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 67 లక్షల మంది మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి.. బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో క్యాంటీన్ల నిర్వహణ అప్పగించామని స్పష్టం చేశారు. పెట్టుబడుల సాధనలో తమ పోటీ గుజరాత్, మహారాష్ట్రలతో కాదని సీఎం స్పష్టం చేశారు. గుజరాత్ కు పెట్టుబడులు సహజంగా రావడం లేదని, అక్కడికి వెళ్లేలా ఒత్తిడి తెస్తున్నారన్నారు. దశాబ్దాలుగా అక్కడ ఒకే అంబాసిడర్ పనిచేస్తున్నారని విమర్శించారు. తన పోటీ చైనా, జపాన్, దక్షిణ కొరియాతోనేనని.. 'చైనా ప్లస్ వన్' అంటే అది కచ్చితంగా తెలంగాణ మాత్రమేనని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ) అనే దార్శనికతతో ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలపై (ఈవీ) ట్యాక్స్ ఎత్తివేశామని, దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రెండు వేల కోట్ల ఆదాయం తగ్గుతున్నా వెనక్కి తగ్గలేదన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను ఎవరి దగ్గరైనా నేర్చుకోవడానికి వెనకాడనని, క్షేత్రస్థాయి సమస్య పరిష్కారానికి అసిస్టెంట్ ఇంజనీర్ సలహా తీసుకునేందుకూ మొహమాట పడనన్నారు. అధికారులందరూ చాలా తెలివైన వారని.. అందుకే సమీక్షా సమావేశాల్లో తాను ముందుగా ఏమీ మాట్లాడనని, అధికారులు చెప్పేవన్నీ నిశితంగా విని చివర్లో నిర్ణయాలు తీసుకుంటానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వల్లే తెలంగాణ కల సాకారమైందని, అందుకే తాను టీడీపీని వీడి కాంగ్రెస్ ను ఎంచుకున్నట్లు వెల్లడించారు

# అష్టదరిద్రులు అడ్డం పడ్డా అభివృద్ధి ఆగదు

- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- కోహెడ పండ్ల మార్కెట్ శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి, జూన్ 6:** ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా రాష్ట్ర అభివృద్ధి ఆగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ స్థాయి సమీకృత పండ్ల మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 2,300 కోట్లతో 240 ఎకరాల్లో నిర్మించే ఈ మార్కెట్ తో మనకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి ఉద్దేశించిన ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులను అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి నిరోధకులుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్, వరంగల్ ఎయిర్ పోర్టు పనులను ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కారు పూర్తిగా చెడిపోయిందని ఎద్దేవా చేశారు. గత పాలకుడు కుర్చీ వేసుకుని కూర్చుని పాలమూరు ప్రాజెక్టు కడతానని చెప్పి తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని ధర్నాలు చేసినా అభివృద్ధి పనులు ఆగవని, 2034 వరకు కాంగ్రెస్ ప్రజా పాలనే కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**రెండేళ్లలో మార్కెట్ పూర్తి..**

ఒకప్పుడు పండ్లు, కూరగాయల సాగుతో కళకళలాడిన రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయం కుంటుపడిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కేవలం వరి, మొక్కజొన్నకే పరిమితం కాకుండా ప్రజలకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటలు పండించాలని సూచించారు. కోహెడలో నిర్మిస్తున్న పండ్ల మార్కెట్ ను రెండేళ్లలో పూర్తి చేస్తామని, గ్రీన్ ఛానెల్ ద్వారా నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్ కే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని చెప్పారు. కాలుష్యం వెదజల్లే ఫార్మా సిటీని రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీని నిర్మించి ఫార్చ్యూన్ 500 కంపెనీలను తీసుకువస్తామని వెల్లడించారు.

**హైటెక్ హంగులతో రిజిస్ట్రార్ ఆఫీసులు..**

ప్రభుత్వానికి ఏటా రూ. 15 వేల కోట్ల నుంచి రూ. 16 వేల కోట్ల ఆదాయం తెస్తున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కనీస వసతులు లేవని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే కోహెడలో అన్ని సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్ లోని 39 ఆఫీసులను 12 క్లస్టర్లుగా విభజించి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు లేకున్నా రాష్ట్రంలో లక్షల టన్నుల వరి పండిందని, వరి రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. ఈ నెల 15 తర్వాత కేంద్రం ధాన్యం కొనకపోతే ప్రధాని మోదీ సంగతి తేలుస్తామని, తమకు మాటలే కాదు చేతలు కూడా తెలుసని హెచ్చరించారు.

# కేంద్రంపై కాంగ్రెస్ కదం!

- నీట్ పేపర్ లీక్, ధరల పెంపునకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ
- బషీర్ బాగ్ నుంచి ట్యాంక్ బండ్ వరకు నిరసన ప్రదర్శన
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఆత్మహత్యలకు కేంద్రానిదే పూర్తి బాధ్యత
- ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేష్




**హైదరాబాద్, జూన్ 6 :** నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ వైఫల్యాలు, ఇంధన ధరల పెంపుతో పాటు రూపాయి విలువ పతనానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. బషీర్ బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. విద్యా వ్యవస్థ వైఫల్యాలతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బషీర్ బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్ బండ్ వరకు సాగిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ సహా పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వారు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాల వల్లే దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు నిరంతరం సామాన్యుడి నడ్డివిరుస్తూ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ తీరును నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. రోజురోజుకూ రూపాయి విలువ పతనమవుతున్నా కేంద్రం కనీసం పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు.

చురకలు



# రాష్ట్రంలో ఇప్పుడూ 'కేటీఆర్' పాలనే

- కాంగ్రెస్ నేతలు, సీఎం బంధువుల కనుసన్నల్లో స్వాహా
- పేదల ఇళ్లు కూల్చి ఆ స్థలాలను పెద్దలకు కట్టబెడుతున్న హైడ్రా
- సర్వే నంబర్ 706లో పవన్ కొన్నది శిఖం భూమే
- సుప్రీంకోర్టుకైనా వెళ్లి సర్కారు కాపాడుతాం
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, జూన్ 6:** రాష్ట్రంలోగతంలో కేటీఆర్ పాలన నడిచిందని, ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందని కవిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీశ్ రావు, రామారావు అని.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు రోజూ చేసుకునే పరస్పర సవాళ్లతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని పెద్దలకు అప్పగిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భూదందాలో సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు చురుకుగా ఉన్నారని విమర్శించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను కాపాడేందుకు సుప్రీంకోర్టు వరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. పేదల కాలనీల్లో హైడ్రాతో దాడులు చేయించి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. శ్రీ ఆదిత్య కంపెనీ రివర్ బెడ్ పైన ప్రాజెక్టు నిర్మిస్తోందని, ఆ కంపెనీ వెనుక ఒక ఎంపీ ఉన్నారని కవిత ఆరోపించారు. ఆ కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని, ఇప్పుడు దాన్ని ముట్టుకునే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి జల వనరులపై కనీస అవగాహన లేదని విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా అని ప్రశ్నించారు. ముందుగా ఏపీ సీఎంతో మాట్లాడి రెండు వందల టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలని హితవు పలికారు. తెలంగాణ బరాబర్ ఇక్కడి ప్రజల జాగీరే అని, అది పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆనాడు ఎంతో కష్టపడి ఆంధ్ర విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు ఇక్కడికి వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. పవన్ కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ పగటి కలలు కంటోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న ఎనిమిది సీట్లు కూడా గల్లంతవుతాయని జోస్యం చెప్పారు. పవన్ కల్యాణ్ పది ఎకరాల శిఖం భూమిని కొనుగోలు చేశారని, కోడికుంట సర్వే నంబర్ 706లో ఉన్న ఆ శిఖం భూమి రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయన్నారు. ఆ భూమిని పవన్ వెంటనే తిరిగి ఇచ్చేయాలని, అక్కడ వేసిన కంచెను తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# అప్రమత్తంగా ఉండండి!

- వర్షాలు, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు
- సీఎం జిల్లాల పర్యటనలకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన



**హైదరాబాద్, జూన్ 6:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. లోతట్టు, వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై సీఎస్ సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 నగరాల్లో 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 72,956 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని వివరించారు. కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. నీట్ ప్రశ్నపత్రాల రవాణాకు తొలిసారిగా భారత వైమానిక దళం సేవలు వినియోగిస్తున్నట్లు వివరించారు. పరీక్షల భద్రతకు ఈసారి ప్రత్యేక ప్రొటోకాల్స్ అమలు చేస్తున్నామని సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు.

# స్టీరింగ్ పట్టిన నారీమణులు!

**గిగ్ వర్కర్ల రంగంలోకి తొలిసారిగా మహిళల ఎంట్రీ**

**ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 'షీస్ రైడ్' ప్రాజెక్టు**

**55 మంది మహిళలకు డ్రైవింగ్ శిక్షణ, లైసెన్సుల ప్రదానం**

**ఈ-బైక్స్, ఈ-ఆటోలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్, జూన్ 6:** మహిళల్లో ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సమాజంలో వారి భద్రతను ఖాయం చేయడమే లక్ష్యంగా పోలీస్, రవాణా శాఖలు సంయుక్తంగా 'షీస్ రైడ్' ప్రాజెక్టును రూపొందించాయి. గిగ్ వర్కర్ల విభాగంలో ఇకపై మహిళలు కూడా భారీగా చేరబోతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు అంబర్ పేట్ పోలీస్ లైన్స్ లో టూవీలర్, త్రీవీలర్ డ్రైవింగ్ లో శిక్షణ ఇచ్చి, లైసెన్సులు అందజేశారు. వీరు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ఈ-బైక్స్, ఈ-ఆటోలను డీజీపీ జెండా ఊపి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జొమాటో, స్విగ్గీ లాంటి డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. రానున్న నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచుతామన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పనిచేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లకు గతంలో మహిళా ఎస్హెచ్ఓలు లేరని డీజీపీ గుర్తుచేశారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే మహిళా ఇన్స్పెక్టర్లను ఎస్హెచ్ఓలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందించేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్స్, కార్గో, డెలివరీ సర్వీసెస్ లో మహిళా డ్రైవర్లకు విస్తృత అవకాశాలు కల్పిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.




# చల్లబడ్డ భాగ్యనగరం!

**ఉక్కపోత నుంచి నగరవాసులకు భారీ ఉపశమనం**

**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి కుండపోత వాన**



**హైదరాబాద్, జూన్ 6:** హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి, నిజాంపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా ఆకస్మికంగా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోవడంతో నగరంలో వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. కుండపోత వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వరద నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ లాంటి రద్దీ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సరిగ్గా కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం హైదరాబాద్ తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, జలమయమైన రహదారులపై ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది.



# 26.51 లక్షల టన్నులు

**సింగరేణిలో కనిష్టానికి బొగ్గు నిల్వలు!**

**పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యల్ప స్థాయికి పతనం**

**హైదరాబాద్, జూన్ 6:** సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు గణనీయంగా తగ్గాయి. గత పదేళ్లలో (2014-2024 మధ్య కాలంలో) ఎన్నడూ లేని విధంగా అత్యల్ప స్థాయికి చేరాయి. సాధారణంగా సగటున 50 లక్షల టన్నులు ఉండాల్సిన నిల్వలు, ప్రస్తుతం 26.51 లక్షల టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ఈ తగ్గుదల అసాధారణం కాదని, ఇది కేవలం సాధారణ ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో భాగమేనని సంస్థ వివరించింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ అవసరాల కోసం కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు అవసరమని యాజమాన్యం పేర్కొంది. కొన్ని ప్రాజెక్టుల్లో పనులు ఆగిపోవడంతోనే ఉత్పత్తి తగ్గిందని వెల్లడించింది. ఓవర్ బర్డెన్ పనులకు సంబంధించిన టెండర్లలో కాంట్రాక్టర్లకు సైట్ విజిట్ సర్టిఫికెట్ ను సింగరేణి సంస్థ తప్పనిసరి చేసింది. సైట్ ను ప్రత్యక్షంగా పరిశీలించకుండానే కొందరు కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారని, ఆ తర్వాత క్షేత్రస్థాయి ఇబ్బందులతో పనులను ఆలస్యం చేయడం, మధ్యలోనే నిలిపివేయడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంది. శ్రీరాంపూర్-2 సహా మరికొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని, ఈ కారణంతోనే 2025 మే నెల నుంచి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానాన్ని కచ్చితంగా అమల్లోకి తెచ్చినట్లు యాజమాన్యం వివరించింది. సింగరేణి మెడికల్ బోర్డు నియామకాల్లో జరిగిన అక్రమాల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేశారని, అక్రమాలకు పాల్పడిన సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. దీనికి తోడు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా ఈ వ్యవహారంపై అంతర్గత విచారణను కొనసాగిస్తోందని, మొత్తం వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో కఠిన చర్యలు తీసుకుంటున్నామని సింగరేణి సంస్థ స్పష్టం చేసింది.

# భూకబ్జా కేసులో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**పదిహేను రోజుల పాటు పరారీ.. కాంచీపురంలో పట్టుకున్న పోలీసులు**

**నార్సింగి పోలీస్ స్టేషన్ వద్ద అనుచరుల భారీ ఆందోళన**

**ఉప్పర్ పల్లి కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్ విధింపు**

**భారీ భద్రత నడుమ చంచల్ గూడ జైలుకు తరలింపు**

**హైదరాబాద్, జూన్ 6 :** గండిపేట ప్రభుత్వ భూముల ఆక్రమణ కేసులో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పదిహేను రోజుల పాటు పరారీలో ఉన్న ఆయనను తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకుని రోడ్డు మార్గంలో హైదరాబాద్ కు తీసుకువచ్చారు. ఉప్పర్ పల్లి కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు ఆయనను భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గండిపేట పరిధిలోని సర్వే నంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా భూమిని కాజేసేందుకు నిమ్మల కుటుంబ సభ్యులు కుట్ర పన్నారు. నకిలీ జీవోలు, పత్రాలు సృష్టించేందుకు మధ్యవర్తిగా ఉన్న రాధాకృష్ణకు బొల్లా బ్రహ్మనాయుడు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి 12 కోట్ల రూపాయల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలింది. స్థానిక తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేయగా.. బ్రహ్మనాయుడితో ఆ సంఖ్య ఆరుకు చేరింది. భూకబ్జా కేసు నమోదైన విషయం తెలుసుకున్న వెంటనే బొల్లా బ్రహ్మనాయుడు పరారీలోకి వెళ్లారు. తొలుత బెంగళూరు వెళ్లిన ఆయన, అక్కడి నుంచి కేరళకు.. ఆ తర్వాత తమిళనాడులోని కాంచీపురం చేరుకున్నారు. ఆయన కదలికలపై నిఘా పెట్టిన సైబరాబాద్ పోలీసులు, ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగం బృందాలు శుక్రవారం కాంచీపురంలోనే బ్రహ్మనాయుడిని అరెస్టు చేశాయి. స్థానిక కోర్టులో హాజరుపరిచిన అనంతరం రోడ్డు మార్గంలో హైదరాబాద్ లోని నార్సింగి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్ కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో.. వినుకొండకు చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఎవరినీ లోపలికి అనుమతించకపోవడంతో పోలీస్ స్టేషన్ బయట కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీస్ స్టేషన్ లో బ్రహ్మనాయుడి స్టేట్ మెంట్ రికార్డు చేశారు. అక్కడి నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పర్ పల్లి కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం బ్రహ్మనాయుడికి 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో పోలీసులు ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. ఈ భూకబ్జాకు సంబంధించి కీలక వ్యక్తుల పాత్రపై పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు






# వ్యవస్థీకృత ఆర్థిక నేరాలు
# వ్యవస్థల నిర్లిప్తత!

**దేశంలో ఆర్థిక మోసాలు కేవలం అంకెలకు పరిమితం కావడం లేదు; అవి వ్యవస్థాగత వైఫల్యాలకు పరాకాష్టగా మారుతున్నాయి. సామాన్యుడి కష్టార్జితం చిట్టీల రూపంలోనో, ఇన్వెస్టర్ల సొమ్ము కార్పొరేట్ షేర్ల రూపంలోనో మాయమవుతున్నా, నిఘా వ్యవస్థలు 'తీగ లాగితే డొంక కదిలే' వరకు ముసుగు తన్ని పడుకోవడం విచారకరం. రాజకీయ అధికారం, కార్పొరేట్ ఆర్థిక బలం చేతులు కలిపినప్పుడు అక్రమాలు ఎలా రాజ్యమేలుతాయో చెప్పడానికి దేశంలో విచ్చలవిడిగా సాగుతున్న కుంభకోణాలే ప్రత్యక్ష సాక్ష్యం. నోళ్లు నొక్కుకోవడం తప్ప, దోషులను బోను ఎక్కించే నాథుడే కరువయ్యాడు.**

**తాజాగా బెంగళూరు కేంద్రంగా వెలుగు చూసిన రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ ఆర్థిక అరాచకం దేశ కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత నల్లని అధ్యాయంగా నిలిచిపోనుంది. సంస్థ వాస్తవ ఆదాయాన్ని ఏకంగా రూ. 15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, కృత్రిమంగా షేర్ విలువను పెంచి అంతర్జాతీయ మార్కెట్‌ను సైతం బురిడీ కొట్టించారు. నమ్మకానికి నిలువెత్తు రూపంగా భావించే ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సైతం ఈ బురిడీని పసిగట్టలేక ఇందులో భారీగా పెట్టుబడులు పెట్టి, నేడు ప్రజాధనాన్ని నష్టాలపాలు చేసింది.** ఈ స్కామ్ వెనుక ఉన్న మూలాలు పరిశీలిస్తే కార్పొరేట్ జగత్తులోని చీకటి కోణాలు విస్తుగొలుపుతాయి. 2015లో ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ అయిన 'వాల్కంబీ'ని కొనుగోలు చేసిన ఈ సంస్థ, స్విట్జర్లాండ్ కేంద్రంగా కథ నడిపించింది. విదేశాల్లో వందల సంఖ్యలో షెల్, సూట్‌కేస్ కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా నిధులను భారీగా మళ్లించారు. సంస్థ సీఎండీ రాజేష్ మెహతా నిబంధనలకు విరుద్ధంగా సంస్థ నిధులను తన వ్యక్తిగత ఖాతాలకు చేరవేసుకున్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు విభాగాలకు కానీ, ఇంటెలిజెన్స్ వర్గాలకు కానీ కనీస సమాచారం లేకపోవడం ఘోర వైఫల్యం. చివరకు 2025లో ఒక సాధారణ ఇన్వెస్టర్ పంపిన ఈ-మెయిల్ ఫిర్యాదుతో సెబీ (రాజుదీ×) రంగంలోకి దిగాల్సి వచ్చింది. నోటీసులు ఇచ్చినా ఆడిట్ రిపోర్టులు ఇవ్వకుండా ఆర్ఈఎల్ యాజమాన్యం మొండికేయడం చూస్తుంటే, వ్యవస్థల పట్ల వీరికి ఎంత చులకన భావం ఉందో అర్థమవుతోంది. మరోవైపు, అధికార గద్దెపై ఉన్నవారు ప్రజాధనాన్ని ప్రాజెక్టుల పేరిట లూటీ చేయడం నిత్యకృత్యమైంది. తెలంగాణలో రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన సంచలన కాళేశ్వరం ప్రాజెక్టు కథ నేడు కంచికి చేరింది. నిర్మాణంలో అవతవకలు, భారీ ఆర్థిక మోసాలు జరిగాయని గల్లీ నుండి ఢిల్లీ దాకా గగ్గోలు పెట్టిన వారే.. నేడు అధికారంలో ఉండి కూడా విచారణను నత్తనడకన సాగిస్తున్నారు. అటు అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన ఇ-కార్ రేసు నిధుల మళ్లింపు ఉదంతంలో, నేరుగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ సంస్థకు నిధులు చెల్లించినా పాలకులు కిమ్మనడం లేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే తీరు కనిపిస్తోంది. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి రుషికొండపై నిర్మించిన జగన్ ప్యాలెస్‌ల వ్యవహారంలో కానీ, వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో కానీ, యథేచ్ఛగా సాగిన భూ కుంభకోణాల్లో కానీ ఎలాంటి కఠిన చర్యలు లేవు. విచారణలనేవి కేవలం పాలకుల మార్పుతో ముడిపడి రాజకీయ కక్షసాధింపు చర్యలుగా మారుతున్నాయే తప్ప, ప్రజాధనాన్ని రికవరీ చేసే దిశగా సాగడం లేదు. ప్రభుత్వ బ్యాంకులను నిలువునా ముంచి వేల కోట్లు కొల్లగొట్టిన విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటి బడా చోరులు విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. వారిని దేశానికి రప్పించడంలో వ్యవస్థలు చేతులెత్తేయడం, తదుపరి తరం ఆర్థిక నేరగాళ్లకు ఒక సురక్షితమైన 'రూట్ మ్యాప్' లా కనిపిస్తోంది. 1980ల నాటి హర్షద్ మెహతా షేర్ మార్కెట్ స్కామ్ లోని లొసుగుల నుండి, 2009 నాటి సత్యం కంపెనీ రామలింగరాజు రూ. 7,800 కోట్ల బ్యాలెన్స్ షీట్ మాయాజాలం వరకు చరిత్ర నిరంతరం పునరావృతమవుతూనే ఉంది. 2023 జనవరిలో అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకలను ఆధారాలతో సహా బయటపెడితే, దేశంలో సంచలనం సృష్టించింది. కానీ చివరకు సెబీ దర్యాప్తు 'తూతూమంత్రం'గా సాగి, ఆ ఆరోపణలను కొట్టిపారేసేలా చేసింది. ఇటువంటి పక్షపాత వైఖరులే కొత్త మోసాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ బరితెగిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.ఒకవైపు బడా కార్పొరేట్లు, పాలకులు లక్షల కోట్లు కొల్లగొడుతుంటే, మరోవైపు అట్టడుగున ఉన్న అమాయక ప్రజలు స్థానిక మోసాలకు బలవుతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా వంటి సంస్థలు లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేసిన చేదు అనుభవం కళ్లముందున్నా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. ఇటీవల తెలంగాణలోని నల్లగొండ, ఏపీలోని కర్నూలు జిల్లాల్లో బయటపడ్డ మైక్రో ఫైనాన్స్ మోసాలు దీనికి నిదర్శనం. గ్రామాల్లో, పట్టణాల్లో అనుమతులు లేని బ్లేడ్ కంపెనీలు, చిట్టీల వ్యాపారులు కోట్ల రూపాయల సామాన్యుల సొమ్ముతో బోర్డులు తిప్పేస్తున్నారు. 'లక్కీ భాస్కర్' వంటి సినిమాలు బ్యాంకింగ్ వ్యవస్థలోని లొసుగులను, ఆర్థిక మోసాల వెనుక ఉన్న చాకచక్యాన్ని వినోదాత్మకంగా చూపిస్తున్నా, వాస్తవ జీవితంలో మాత్రం బాధితుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. ఉదారవాద ఆర్థిక విధానాల మాటున జరుగుతున్న ఈ వ్యవస్థీకృత దోపిడీకి పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం. ఆర్థిక నేరాలంటే కేవలం సైబర్ లింకులు, ఓటీపీల మోసాలు మాత్రమే కాదు; వైట్ కాలర్ నేరగాళ్లు చేసే ఇలాంటి బడా కార్పొరేట్ మోసాలు దేశ ఆర్థిక వెన్నెముకను విరిచేస్తున్నాయి. రాజకీయ పక్షపాతాలు, పలుకుబడులకు అతీతంగా విచారణలు జరగాలి. తప్పు రుజువైతే సత్యం రామలింగరాజు తరహాలో తక్షణ జైలు శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. దోషుల అంతర్జాతీయ ఆస్తులను జప్తు చేసేలా పకడ్బందీ అంతర్జాతీయ చట్టాలను అమలు చేయాలి. లేనిపక్షంలో, సామాన్య పౌరుడికి ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థపై నమ్మకం పూర్తిగా సడలిపోయి, దేశం తీవ్ర అరాచకత్వంలోకి జారుకునే ప్రమాదం ఉంది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!

**ఇదే తమ మొదటి డిమాండ్..**
**కొనసాగిస్తాం కూడా..**
- **ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్యత వహించాల్సిందే**
- **కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్**
- **జంతర్ మంతర్ వద్ద ధర్నా..**
- **పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్**






**న్యూఢిల్లీ, జూన్ 6 :** నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయ-ువేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

**ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం**

**హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు**

**టెహ్రాన్, జూన్ 6:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.



# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**ప్రధాని మోదీ కీలక భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 6:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రధాన ఆర్థిక సలహా మండలి సభ్యులతో కీలక సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై తగ్గించే మార్గాలతో పాటు దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో 'ఈజ్ ఆఫ్ లివింగ్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సంస్కరణలను వేగవంతం చేయడం, ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం భారత్‌తో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండబోతుందన్న దానిపై మండలి సభ్యులు తమ అంచనాలను ప్రధానికి వివరించారు. ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హర్ముజ్ జలసంధి ప్రాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ చమురు ధరలు, సరఫరా గొలుసులు, వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్‌కు అవసరమైన ఇంధన దిగుమతుల్లో గల్ఫ్ ప్రాంతం కీలక పాత్ర పోషిస్తున్నందున, అక్కడి పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. చమురు ధరల పెరుగుదల, సరఫరా అంతరాయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై కూడా సమావేశంలో చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, ఆర్థిక అనిశ్చితుల మధ్య కూడా భారత్ వృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

**నీళ్లు లేక 49మంది మృత్యువాత**



**సహారా, జూన్ 6:** పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# సమాజ భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి**
- **పరిగిలో "సురక్ష మిత్ర" కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**





పరిగి పట్టణంలో నిర్వహించిన "సురక్ష మిత్ర" కార్యక్రమం ప్రారంభోత్సవానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఐఏఎస్,జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ మరియు ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే "సురక్ష మిత్ర" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,జిల్లాలోనే మొట్టమొద టిసారిగా పరిగి పట్టణంలో సురక్ష మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని,ఇందుకు ప్రత్యేక కృషి చేసిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో మంచి కార్యక్రమాలను అమలు చేస్తోందని,అయితే ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే వాటి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరుతాయని అన్నారు. మహిళలు, విద్యార్థులు,చిన్నారులు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం మరియు పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే మహిళలు,చిన్నారులు,విద్యార్థుల భద్రతను సమర్థవంతంగా కాపాడగలమని పేర్కొన్నారు. సమాజంలో జరిగే చిన్న చిన్న తప్పులను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. చిన్న పొరపాట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో అవి పెద్ద సమస్యలుగా మారే ప్రమాదం ఉందన్నారు. సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో ఎక్కువ సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కుటుంబం అభివృద్ధి చెందడంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, ఒక తల్లి చదువుకున్నదైతే కుటుంబమంతా విద్యావంతం అవుతుందని పేర్కొన్నారు .ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, మంచి విద్యను అభ్యసించాలని, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఉన్న వివిధ రుగ్మతలను తొలగించేందుకు యువత, మహిళలు, ప్రజలందరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

మద్దూరు మున్సిపల్ 1వ వార్డులో పారిశుధ్ధ కార్యక్రమలను పరిశీలిస్తున్న

## చెర్ పర్సన్ డీల్లికార్ సరస్వతి జనార్దన్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్,



**మద్దూరు మున్సిపల్, జూన్,06() :** నారాయణపేట జిల్లా లోని మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని 1 మరియు 16 వార్డులలో "ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగముగా 1వ వార్డు లో పారిష్యుధ్ధ కార్యక్రమాలను చైర్‌పర్సన్ ఢిల్లీకర్ సరస్వతి జనార్దన్ ,కమీషనర్ శ్రీకాంత్ పరిశీలించడం జరిగింది. 1వ వార్డు కౌన్సిలర్ సంబిత, మరియు నాయకులు పాల్గొనడం జరిగింది.

## మర్పల్లి ఘటనలో గాయపడిన వారిని పరామర్శించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**సంగారెడ్డి, జూన్ 06(.** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనలో గాయపడి సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురు బాధితులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చందన (12), తండ్రి చాద్రు, రమేష్ (25), తండ్రి నరసింహులు లను స్పీకర్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ లలితా దేవి లను స్పీకర్ ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం గోకుల్ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఎం. డి. నజీర్ (17) మరియు బాలాజీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం. శివకుమార్ (25) లను స్పీకర్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యాలను, డి ఎం అండ్ హెచ్ ఓ ను కోరారు. ఈ సందర్భంగా బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన స్పీకర్,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా నిచ్చారు.

## "సురక్ష మిత్ర" అనే విన్నూత కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం అమలు

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

- **అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి**
- **ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**




**హైదరాబాద్, జూన్ 03:**

సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.



### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యా కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు

- **కె. రవీందర్ గౌడ్ ఉపాధ్యాయులు దుద్యాల**





**దుద్యాల మండలం, జూన్,06( :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుద్యాల ఉపాధ్యా యులు సమీప గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం అలీ ఖాన్ పల్లి గ్రామములో నిర్వహిస్తూ దుద్యాల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో తరగతిలో మండల స్థాయి మార్కులు సాధించడం జరిగిందని కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య పైన చూపుతున్నటువంటి ప్రత్యేకత పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి ఇవి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిం చబడుతుందని కావున ప్రతి తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించి వారికి నాణ్యమైన విద్య అందే విధంగా తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కె రవీందర్ గౌడ్ ' రాము' రమేష్ 'అశోక్ తదితరఉపాధ్యాయులు పాల్గొన్నారు

## దేవనూర్ గ్రామసభకు ప్రత్యేక అధికారిగా ఎమ్మార్వో గాయత్రి

- **పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ నేత్రంపై ఎస్సై విఠల్ రెడ్డి అవగాహన**
- **దేవనూర్ సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు**





**యాలాల మండలం, జూన్,06( :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా దేవనూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ప్రత్యేక అధికారిగా ఎమ్మార్వో గాయత్రి హాజరయ్యారు. రాబోయే వర్షాకాలంలో తలెత్తే సమస్యలు,గ్రామంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై పంచాయతీ అధికారులు,ప్రజాప్రతినిధులు గ్రామస్థులతో చర్చించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా మురుగు కాలువల పూడికతీత,పారిశుధ్య నిర్వహణ,తాగునీటి సరఫరా,రహదారుల మరమ్మతులు,మొక్కల పెంపకం వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని అధికారులు సూచించారు. అదేవిధంగా దేవనూర్ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రక్షణ నేత్రం" పోస్టర్లను ఎస్సై విఠల్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత మరింత బలోపేతం అవుతుందని వివరించారు. మహిళా రక్షణ, మాదక ద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు,యాలాల ఎమ్మార్వో గాయత్రి, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి ఉప సర్పంచ్ బోడ్కా మాధవి మల్లేశం వార్డు సభ్యులు ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్ గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి ఆశా కార్యకర్తలు,పోలీస్ సిబ్బంది వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పల్లెర్ల లో ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించిన ఎంఈఓ జనార్ధన్ రెడ్డి,స్థానిక సర్పంచ్ వెంకట్రామిరెడ్డి



**మద్దూరు మండలం, జూన్,06 :** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఈ విద్య సంవత్సరం నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడం జరుగుతుంది అందులోభాగంగా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూ ర్ మండల పరిధిలోని పల్లెర్ల ప్రాథమిక పాఠశాలకు మంజూరు చేశారు. శనివారం బడిబాటలో భాగంగా పల్లెర్ల కు విచ్చేసిన మండల విద్యాధికారి జనార్ధన్ రెడ్డి స్థానిక సర్పంచ్ వెంకట్రామిరెడ్డి తో కలిసి పల్లెర్ల పాఠశాలకు మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశా లను ప్రారంభించారు ఈ సందర్భంగా మండల విద్యాధికారి జనార్ధన్ రెడ్డి మాట్లాడు తూ.. మూడు సంవత్సరాలు నిండిన బాలబాలికల కోసం ప్రభుత్వం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నే ప్రీ ప్రైమరీ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చింది అని ఇది గ్రామస్తులు సద్వినియోగ పరుచుకొని ప్రయివేటు పాఠశాలలో వేలాది రూపాయలు వెచ్చించే బదులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పావని,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు ఉపాద్యాయులు అనిల్, వీరేందర్, శ్రీకాంత్, రాజు నాయక్,హరిచందన,ప్రణీత, హరి సూదన్ రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని.. ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి.





**బషీరాబాద్ మండలం, జూన్,06(:** బషీరాబాద్ మండల్ మర్పల్లి గ్రామ శివారులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మరియు బుగ్గ రామేశ్వరం దేవాల యం లో వార్షికోత్సవ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి...ఇట్టి పూజ కార్యక్రమంలో మనోహర్ రావు (అడ్వకేట్) రాష్ట్ర టీపీసీసీ ప్రచార కో ఆర్డినేటర్ కరణం పురుషోత్తం రావు, నీళ్లపల్లి సుధాకర్ రెడ్డి, పర్వత్పల్లి వెంకటయ్య, ఎంపీటీసీ రాజు, సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ బసంత్, చందర్ రెడ్డి, గొట్టిగ శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు బిర్కెట్ రఘు, అగ్గనుర్ సంకేత్, సిద్ధా అయ్యా,రవి, గౌతమ్, మరియు తదితరులు పాల్గొన్నారు...

చురకలు ఆదివారం 7 జూన్ 2026

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా ప్రజలను ప్రోత్సహించాలని

■ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. లలితా దేవి



**సంగారెడ్డి జూన్ 6** జిల్లా శనివారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. లలితా దేవి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆరోగ్య మిత్రల నియామకానికి సంబంధించిన పరీక్షను నిర్వహించారు. అనంతరం ఆర్.సి. పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి లేబర్ రూమ్, ప్రయోగశాల (ల్యాబ్), వ్యాక్సినేషన్ రూమ్‌ల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవల నిర్వహణ సంతృప్తికరంగా ఉండటంతో మెడికల్ ఆఫీసర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. ఆసుపత్రిని నిర్దేశిత సమయాలకు అనుగుణంగా తెరిచి ఉంచాలని, విధులకు ఆలస్యంగా హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సిబ్బందికి సూచించారు

## "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా వార్డు 1 మరియు 16 లో అభివృద్ధికి సంబంధించి అంశాలపై ప్రజల నుండి వినతులు, సూచనలు

■ మున్సిపల్ చెర్ పర్సన్ డిల్లీకర్ సరస్వతి జనార్ధన్, కమిషనర్ శ్రీకాంత్,




**మద్దూరు మున్సిపల్,జూన్,06()** : నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని 1 మరియు 16 వార్డులలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఢిల్లీకర్ సరస్వతి జనార్దన్,కమీషనర్ శ్రీకాంత్, 1వ వార్డు కౌన్సిలర్ సంేత,కో ఆప్షన్ మెంబర్ యషీన్, యాదవ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ వెంకట్రాములు, జనార్దన్, స్వయం సహాయక సంఘాల (రాం+) సభ్యులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజల నుండి వినతులు, సూచనలు స్వీకరించడం జరిగింది.

## సింగరేణిలో 26.51 లక్షల టన్నులే బొగ్గు నిల్వలు: యాజమాన్యం

**హైదరాబాద్, జూన్ 6(**. సింగరేణి కాలరీస్ కంపెనీలో ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇది గత పదేళ్లలో నమోదైన అత్యల్ప నిల్వ అని సంస్థ యాజమాన్యం తెలిపింది. 2014 నుంచి 2024 వరకు సగటున 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు వెల్లడించింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అంతరాయం లేకుండా బొగ్గు సరఫరా చేసేందుకు తగిన నిల్వలు అవసరమని పేర్కొంది. బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో కొంత మేర నిల్వలు ఉండటం సహజమేనని వివరించింది. ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులకు సంబంధించిన టెండర్లలో కాంట్రాక్టర్లు స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహనతో పాల్గొనేందుకు సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను మే-2025 నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపింది. గతంలో కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. డిపెండెంట్, కారుణ్య నియామకాల కోసం నిర్వహించే మెడికల్ బోర్డుల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం ఫిర్యాదుతో ఏసీబీ విచారణ కొనసాగుతోందని పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేయగా, శాఖాపరమైన చర్యలు కూడా చేపట్టినట్లు వెల్లడించింది. మరోవైపు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా అంతర్గత విచారణ కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది.

## కాంగ్రెస్ నేత అల్కా లాంబాకు ఏడాది ప్రొబేషన్

**న్యూఢిల్లీ జూన్6( . :** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్ర ్మంలో పోలీసులపై దాడి కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ నేత ాశ్రీఃఝ ఝఎఝకు కోర్టు జైలు శిక్షకు బదులుగా ఒక సంవత్సరం సత్ప్రవర్తన ప్రొబేషన్ మంజూరు చేసింది. కోర్టు ఆమె రూ.1 లక్షల బాండ్ సమర్పించాలని ఆదేశించింది. ప్రొబేషన్ కా లంలో నిబంధనలను ఉల్లంఘించకుండా ఉంటే జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేసింది. కొద్ది రోజుల క్రితం కోర్టు అల్కా లాంబాను దోషిగా నిర్ధారించింది. మహిళా రిజర్వేషన్ అంశంపై ఝఃఝతీ మీఝఃఝతీ వద్ద నిర్వహించిన నిరసనకు ఆమె నాయకత్వం వహించారని పోలీసులు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులను తోసివేయడం, విధులకు ఆటంకం కలిగించడం, కోర్టు ఆదేశాలను ధిక్కరించడం, ప్రజా మార్గాన్ని దిగ్బంధించడం వంటి అభియోగాలను నమోదు చేశారు.

## వంటనూనెల ప్యాకింగ్‌కు ప్రామాణిక పరిమాణాలు

**న్యూఢిల్లీ: జూన్6(:** వంటనూనెల ప్యాకెట్లకు ప్రామాణిక పరిమాణాలను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ నిర్ణయించింది. లీగల్ మెట్రాలజీ చట్టపరమైన విధానంలో మార్పులు చేస్తూ ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని సవరించింది. వినియోగదారులు ధరలను సులభంగా పోల్చుకునేలా, ప్యాకింగ్‌లో పారదర్శకత పెంచేలా ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై వంటనూనె ప్యాకెట్లపై పరిమాణంతో పాటు దానికి సమానమైన బరువు వివరాలను కూడా చూపించాల్సి ఉంటుంది. దేశీయంగా తయారయ్యే వంటనూనెలతో పాటు దిగుమతి చేసుకునే వంటనూనెలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయి. కొత్త విధానానికి అనుగుణంగా మారేందుకు తయారీదారులకు మూడు నెలల గడువు ఇచ్చింది. 850 మి.లీ, 900 మి.లీ వంటి భిన్న పరిమాణాల వల్ల వినియోగదారులకు ధరల పోలికలో కలిగే గందరగోళం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

## పంటల మార్పిడిపై వ్యవసాయ కమిషన్ నివేదిక విడుదల




**హైదరాబాద్ జూన్6( : :** రాష్ట్రంలో పంటల మార్పిడి అవసరంపై వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విడుదల చేశారు. కేరళ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసిన అంశాలతో నివేదిక రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణలో గతంలో సాంప్రదాయ, వర్షాధార పంటలు ఎక్కువగా సాగయ్యేవని, క్రమంగా రైతులు వరి, పత్తి పంటల వైపు మళ్లారని కోదండరెడ్డి అన్నారు. వరి, పత్తి నుంచి ఇతర పంటల వైపు రైతులు రావాలంటే ఆర్థిక సహాయం, గిట్టుబాటు ధర, మద్దతు ధరలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు ధాన్యాల సాగు తగ్గుతోందని, కోతుల బెడద కారణంగా రైతులు పంటల మార్పిడికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కోతుల నివారణకు సోలార్ ఫెన్సింగ్, కుటుంబ నియంత్రణ చర్యలను నివేదికలో సూచించినట్లు చెప్పారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని కమిషన్ సభ్యుడు గోపాల్ రెడ్డి అన్నారు. రైతులు వరితో పాటు కందులు, జొన్నలు, పప్పు ధాన్యాలు, కూరగాయల పంటల వైపు మళ్లితే లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పంటల మార్పిడికి గిట్టుబాటు ధర, బోనస్ కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కమిషన్ సూచించింది.

## డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శంగా చెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం

■ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, జూన్,06():** డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో తాండూరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వెంకటాచారి,తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాథోడ్ దశరథ సింగ్, మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపు పై కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ...తాండూర్ నియోజక వర్గంలో డబుల్ బెడ్ రూముల నిమిత్తం 8333 దరఖాస్తులు వచ్చాయని,1001 డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు ప్రస్తుతం 581 ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల కేటాయింపులు ఎలాంటి అవకతవకలు తావు ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లు అయితే మాత్రమే ఇండ్ల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హత లేకుండా ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిసిన పక్షంలో ఫిర్యాదులను స్వీకరించి మరో దఫా విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

## పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి

■ గుత్తా సుఖేందర్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 6( :** మాదాపూర్ హైటెక్స్ హాల్-4లో నిర్వహించిన "పోచంపల్లి ట్రెడ్" వస్త్ర ప్రదర్శనకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించి, వర్తకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఢిల్లీలో సహచర ఎంపీలు, కేంద్ర మంత్రులకు పోచంపల్లి శాలువలు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించేవాడినని గుర్తు చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం తాను కృషి చేశానని చెప్పారు. చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హైటెక్స్‌లో జరుగుతున్న ఈ వస్త్ర ప్రదర్శనను సందర్శించి, నాణ్యమైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని సూచించారు.

## జూన్ 21న నిర్వహించే నీట్ పున పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులకు ఆదేశం




**వికారాబాద్, జూన్,06(** జూన్ 21న నిర్వహించే నీట్ పున పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి నీట్ పునః పరీక్ష, యోగా దినోత్సవం, వరి ధాన్యం సేకరణ, మహిళా సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పరేడ్ గ్రౌండ్ లో ప్రారంభోత్సవం, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ , ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ సమావేశాలు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ... జూన్ 21న నిర్వహించే పరీక్షను ఏంటిఏ ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని (5) పరీక్షల కేంద్రాల్లో అన్ని సదుపాయాలు సమకూర్చు కోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు రావడం వల్ల వరి ధాన్యం తడిసే ప్రమా దం ఉందని, దానికి తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకొని వరి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు, గోదాములకు చేరవేయా లని ఆయన పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. అవసరాలను బట్టి ట్రాన్స్ పోర్ట్ లారీల సంఖ్యను పెంచుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మొత్తం 19 మండల మహిళా సమాఖ్యల ద్వారా 19 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మహిళా సమాఖ్యలు స్థిరమైన ఆదాయం పొందుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆయన తెలిపారు. జనవరి 9న పరేడ్ గ్రౌండ్ లో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమంలో భాగంగా అద్దె బస్సులను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే మహిళా సమాఖ్య సభ్యులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు సదుపాయంతో పాటు ఆశా వర్కర్ ప్రతి బస్సులో ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) కే వెంకటాచారి, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయి లత, చీఫ్ సూపరింటెండెంట్ డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు.

**● జిల్లా ఎస్పీ: డాక్టర్.వినీత్.**

**● మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి**

**నారాయణపేట, జూన్,06( :** ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగాచేసుకో నేందుకు సైబర్ నేరగాళ్ల కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.

మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్. ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి



మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జూన్ 6( ) :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్ళి ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేసి మాట్లాడుతూ, ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని, సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులుఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, బిఆర్ఎస్, బీజేపి, సిపిఐ(ఎం), ఐ.ఎన్.సి., తెలుగు దేశం పార్టీ ప్రతినిధులు ఎస్. సుబ్బారావు, వి. రామయ్య, ఎల్.సతీష్ బాబు, వి.రాజేష్, ఎన్.వీర బాబు, ఏ.గోపాల్, పాలడుగు టి.ఆర్. కృష్ణ ప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**--జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**

**నారాయణపేట, జూన్,06(:** పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతు పనులన్నింటినీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు.

శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల ఎస్. వో లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 12 పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని, అంతలోపు జిల్లాలోని 11 కేజీబీవిలలో మైనర్ రిపేర్ పనులన్నీ పూర్తి కావాలన్నారు. మేజర్ రిపేర్ పనులను రెండు నెలల్లో పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఉట్కూర్ కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణం వివాదాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించి పనులు ప్రారంభింప చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉట్కూర్ కేజీబివీ లో ఇంటర్ పూర్తయిన విద్యార్థినులు ఎవరెవరు ఎక్కడెక్కడ చదువు తున్నారో వివరాలు సేకరించి ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వో కు సూచించారు. అలాగే మద్దూరు,మాగనూరు, మక్తల్ కేజీబీవీ పాఠశాలల మరమ్మతు పనులు గురించి అధికారులు, ఎస్.వో లను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలల పునః ప్రారంభం



నాటికి అన్ని కేజీబీవీలు, ఎస్సీ ఎస్టీ వసతి గృహాలను శుభ్రం చేయించి, అవసరమైన పాఠశాలలో పెయింటింగ్ పనులు, చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులను, తాగునీటి పైప్ లైన్ పనులను వెంటనే చేయించాలన్నారు. మళ్ళీ రెండు నెలల్లో సమావేశం నిర్వహిస్తానని, ఆ సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని ఎస్.వో లను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీ సీ డీ వో సంబిత, సాంఘిక సంక్షేమ శాఖ/ వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు, ఎస్.వో లు పాల్గొన్నారు.

## పరిగి కొత్తకుంట చెరువును పరిశీలించిన పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి



**పరిగి మున్సిపల్, జూన్,06( :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని కొత్తకుంట చెరువును పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, పరిగి మున్సిపల్ నూతన కమిషనర్ కే. మల్లేష్ , స్థానిక నాయకులు మరియు అధికారులతో కలిసి పరిశీలించారు.చెరువు ప్రస్తుత పరిస్థితి, అభివృద్ధి అవకాశాలు,పరిసర ప్రాంతాల పరిశుభ్రత,ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు.చెరువు అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక..

**● పూర్వ విద్యార్థుల సందడి**



**సిద్దిపేట, జూన్ 6:** కాలం మారినా, బాధ్యతలు పెరిగినా విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు మాత్రం చెదరిపోవని మరోసారి నిరూపితమైంది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ తడ్కపల్లి పాఠశాలలో 18 ఏళ్ల తర్వాత నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది.దాదాపు రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు చూసుకుని భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొందరు మిత్రులు ఆనందభాష్పాలు కార్చగా, మరికొందరు పాఠశాల రోజులలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ నవ్వుల్లో మునిగిపోయారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందారు. నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు తమ ప్రస్తుత ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ విశేషాలను పంచుకున్నారు. పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు.చివరగా భవిష్యత్తులో మరిన్ని సార్లు ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించుకుని వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఆనందయ్య, విఠల్, శ్యాంసుందర్, బాల్‌లింగం, నరసింహచారి, సదానందరెడ్డి, సుమిత్రతో పాటు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి



**రాయపోల్, జూన్ 6:** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏడీఏ బాబు నాయక్ సూచించారు. పల్లె ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ సభకు సర్పంచ్ దివ్య కృష్ణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడుతూ, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలోని డ్రెయినేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్ల పక్కన పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, నిల్వ నీరు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల మెరుగుదల తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించి పలు సూచనలు స్వీకరించారు. పల్లె ప్రగతి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై మానస, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఉప సర్పంచ్ వీరేశం, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా

**● తృటిలో తప్పిన ప్రమాదం**



**రాయపోల్, జూన్ 6:** రాయపోల్ మండలంలోని మంతూరు గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద పెద్దగుట్ట పండుగ నిర్వహించే కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలాల గుండా వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ చక్రం పక్కనున్న ఒరంపైకి ఎక్కడంతో అదుపుతప్పి బోల్తా పడింది.అయితే ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ట్రాక్టర్ బోల్తా పడటంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఆందోళన నెలకొన్నప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్థులు ఊరట చెందారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, జూన్,06( :** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణ సముదాయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. మార్కెట్ సముదాయం లోపలి ఓపెన్ షెడ్ల ను తిరిగి చూశారు.సముదాయ వ్యయం,నిర్మాణం, ప్రారంభం తర్వాత ఎన్ని నెలల పాటు వినియోగంలో ఉంది? ప్రస్తుత పరిస్థితి గురించి పుర కమిషనర్ శంకర్ ను అడిగి తెలుసుకున్నారు.

# బాన్సువాడలో ఘనంగా జరిగిన భూమి పూజ కార్యక్రమాలు అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్యే పోచారం.

**పోతంగల్, జూన్ 06 ( ) :-** బాన్సువాడ నియోజకవర్గంలోని పోతంగల్ మండలంలో అభివృద్ధి పనుల జోరు కొనసాగుతోంది. శనివారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, తిర్మలాపూర్ మరియు పి.ఎస్.ఆర్ నగర్ గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు బాన్సువాడ గౌరవ శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. తిర్మలాపూర్ గ్రామంతో పాటు పి.ఎస్.ఆర్ నగర్‌లో అత్యంత భక్తిపూర్వకంగా, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు గారు సైతం ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ పంచా యతీలకు సొంత భవ నాలను



నిర్మిస్తున్నా మని, వీటి ద్వారా ప్రభుత్వ పథ కాలు, సేవలు ప్రజలకు వేగంగా అం దుతాయని తెలిపారు. ఈ అభివృద్ధి పనుల ప్రారం భోత్సవం లో స్థానిక ప్రజా ప్రతిని ధులు, మండల ముఖ్య నాయకులు, కార్య కర్తలు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై కార్య క్రమాన్ని విజయవంతం చేశారు.

# నవోదయకు ఎంపికైన కోటగిరి విద్యార్థిని అద్యశ్రీ



**కోటగిరి, జూన్ 6 ( :-** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులం గ్రామానికి చెందిన సిద్ధి అద్యశ్రీ, 2026-27 విద్యా సంవత్స రానికి నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో 69వ ర్యాంకు సాధించి నిజామాబాద్‌లోని నవోదయ పాఠశాలకు ఎంపికైంది. కోటగిరి యశశ్రీ హైస్కూల్‌లో చదివిన అద్యశ్రీ ఈ ఘనత సాధించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్, ఉపాధ్యాయ బృందం మరియు ఆమె తల్లిదండ్రులు సుధాకర్, అర్చనలతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# దేవుని గుట్ట తండా గర్వించదగ్గ ఘనత: ఆర్మీలో చోటు దక్కించుకున్న శ్రీహరి



**కోటగిరి, జూన్ 6 () :-** కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండాకు చెందిన వడిత్య శ్రీహరి ఇండియన్ ఆర్మీ (అగ్నివీర్)లో ఉద్యోగం సాధించిన సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లా సేవలాల్ సేన కమిటీ ఆధ్వర్యంలో శ్రీహరిని శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సేవలాల్ సేన నాయకులు సీతారాం మాట్లాడుతూ, శ్రీహరి విజయం తండాలోని ఇతర యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాగా, ఇదే కార్యక్రమంలో జగదంబా మాత సేవలాల్ మహారాజ్ ఆలయానికి గడియారాన్ని విరాళంగా అందజేసిన గుగులోత్ సోమ్లు, తాన్యా నాయక్ దంపతులను కూడా గ్రామ-స్తులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోర్ర రవి నాయక్, తండా కరోబారి దేవుల నాయక్, గ్రామ పెద్దలు, సేవలాల్ సేన ప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన


- పరిగి ఎమ్మెల్యే డాక్టర్. టీ. రామ్మోహన్ రెడ్డి



**పూడూరు మండలం, జూన్,06( :** పూడూరు మండలంలోని మాటు గూడెం గ్రామంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని,సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

- వివాహ వార్షికోత్సవ వేడుకలో ఆత్మీయంగా అభినందనలు



**రాయపోల్, జూన్ 6:** జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రి దంపతులను ఆత్మీయంగా అభినందించారు.

ఈ సందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మంత్రి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని అభిలషించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాములు, రాయపోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తప్పేట సుధాకర్, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి, యువజన నాయకుడు జాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి దంపతులతో నాయకులు కొద్దిసేపు ముచ్చటించి తమ శుభాకాంక్షలు తెలియజేయగా కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడితే పీడీ చట్టం కింద చర్యలు

## డీలర్లతో మండల వ్యవసాయ అధికారి నరేష్ సమావేశం.



**రాయపోల్, జూన్ 6:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచడం డీలర్ల బాధ్యత అని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ హెచ్చరించారు. శనివారం రాయపోల్ రైతు వేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన నాణ్యమైన సన్న రకాల వరి విత్తనాలను తగినంత మేర నిల్వ ఉంచాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు సంబంధించిన లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. లైసెన్సు పొందిన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, ధరలు, స్టాక్ వివరాలను షాపుల ముందు ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు విక్రయించిన ప్రతి ఉత్పత్తికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, ఆ రశీదుపై రైతుల సంతకాలు తీసుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయాలు జరిపినా, గడువు ముగిసిన లేదా నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల చట్టం--1966 నిబంధనలను ఉల్లంఘించి పాత స్టాక్ లేదా చెల్లుబాటు కాని స్టాక్‌ను నిల్వ ఉంచినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్ఐ దేవయ్య, జనార్ధన్‌తో పాటు మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర డీజీపీ రాష్ట్రంలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**వికారాబాద్, జూన్,06( :** తెలంగాణ రాష్ట్ర గౌరవ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)శనివారం రాష్ట్రంలోని పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లాలోని డిఎస్‌పి ,ఇన్స్పెక్టర్,ఎస్‌హెచ్‌ఓ అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యంగా జజుచీా 2.0 (*Crime and Criminal Tracking Network & Systems*) పరిధిలో కేసుల దర్యాప్తు అప్‌డేషన్‌కు సంబంధించిన గడువులు, పెండింగ్ దర్యాప్తుల సకాలంలో పూర్తి, కేసు వివరాల ఆన్‌లైన్ నమోదు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, ాజ=దీ (్ఫ్వ జతీఅఎవ =వఫశీతీం దీబతీముబ) నివేదికల సమర్పణ మరియు ఇతర సాంకేతిక ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాలపై మీటింగ్ నిర్వహించడం జరిగింది. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లా లోని పోలీస్ అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో జజుచీా 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కేసుల దర్యాప్తు పురోగతిని నిర్దేశిత గడువుల్లో అప్‌డేట్ చేయడం, నాణ్యమైన డేటా ఎంట్రీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, ాజ=దీ నివేదికలను సకాలంలో సమర్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని, రాష్ట్ర పోలీసు శాఖ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, తాండూర్ డిఎస్‌పి యాదయ్య, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ , ఏఆర్ డిఎస్‌పి వీరేష్, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చెందిన అధికారులు,విభాగాధిపతులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఓటమి గెలుపుకు తొలిమెట్టని అన్నారు

## రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.




**హైదరాబాద్ జూన్6( :** గచ్చిబౌలి లో దాదాపు నెల పైగా సాగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలకు మంత్రి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి గారు మాట్లాడుతూ....

ఏప్రిల్ 24 నుండి జూన్ 7 వరకు జరిగిన ఈ సమ్మర్ క్యాంపు లో 600 మంది విద్యార్థులు పాల్గొనడం అభినశీదనీయమన్నారు. ప్రతీ సంవత్సరం వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. చిన్న చిన్న సమస్యలకు విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్రీడలు మాత్రమే మానసిక, శారీరక ధృడత్వాన్ని కలగజేస్తాయని తెలిపారు. ఓటమికి కుంగిపోకుండా మళ్ళీ ఎలా విజయం సాధించాలనే కసి విద్యార్థులకు పెరగాలన్నారు .విద్యార్థులు ఫోన్ లకు అలవాటు పడకుండా మైదానాలకు అలవాటు పడాలని హితబోధ చేశారు. మత్తు వదలి మైదానాలు చేరాలనే నినాదం తో ఈ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలియజేశారు. ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్నీ మైదానాలను అభివృద్ధి చేసి మంచి నైపుణ్యం ఉన్న కోచ్ లను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈసారి క్రీడలకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. సీఎం కప్ సెకండ్ ఎడిషన్ లో భాగంగా దాదాపు 3 లక్షల మంది పిల్లలు గ్రామీణ,మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి లో క్రీడలు ఆడారని మంత్రి పేర్కొన్నారు .ఇప్పుడు 3వ ఎడిషన్ లో 5 లక్షల క్రీడాకారులను పాల్గొనేలా చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నామని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఈ సందర్బంగా సమ్మర్ క్యాంపు లో శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎంవీర్ గ్రూప్ చైర్మన్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

## కలెక్టర్ దివాకర టీఎస్



**మధుర జూన్6( . :** ఖమ్మం జిల్లా మధిర మండలం జాలిముడి గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ప్రతి ఇంటిని బీఎల్‌వోలు సందర్శించి వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని ఆదేశించారు. జూన్ 24 నుంచి జూలై 25 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా అమలు చేయాలని సూచించారు. డబుల్ ఓట్లు, మరణించిన మరియు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను పరిశీలించి తొలగించాలని, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు అన్ని క్లెయి మ్‌లు, అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని, బీఎల్ వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందిం చాలని కలెక్టర్ ఆదేశించారు. రాజకీయ పార్టీలు, ప్రజ లు ఈ ప్రక్రియకు సహకరించాలని కోరారు.

# ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో జొన్నల కొనుగోళ్లు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ జూన్6( . :** ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి 2025–26 సీజన్‌కు సంబంధించిన జొన్నల కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టగా, జిల్లా యంత్రాంగం సమన్వయంతో కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 1.12 లక్షల ఎకరాల్లో జొన్నల సాగు జరిగి, గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 16 లక్షల క్వింటాళ్ల దిగుబడి నమోదైనట్లు తెలిపారు. రైతుల స్వీయ వినియోగం మినహాయించి సుమారు 7 లక్షల క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. గత యాసంగి సీజన్‌లో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా 56 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరించగా, ఈసారి రైతులకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కొనుగోలు కేంద్రాల సంఖ్యను 26కు పెంచినట్లు తెలిపారు. దీంతో రైతులు తమ సమీప కేంద్రాల్లోనే పంటను విక్రయించే అవకాశం పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 26 కొనుగోలు కేంద్రాల ద్వారా 19,889 మంది రైతుల నుంచి సుమారు 5.87 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియ తుది దశలో ఉందని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉ ందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు తదితర మౌలిక వసతులు కల్పించామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను చెల్లించడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# జిల్లాలోనే పల్లి (బి) ఆదర్శ గ్రామంగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా





**అదిలాబాద్ జూన్6( :** జిల్లాలోనే పల్లి(బి) గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన –ప్రగతిప్రణాళిక లో భాగంగా తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వివరాలను గ్రామసభలో వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు దిగుబడి పెంచే ట్రైకోడెర్మా వంటి పద్ధతులు పాటించాలని కోరారు. అలాగే, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయాలని, హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి పరిధిలోనూ, అటవీ ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మహిళా భద్రత, సురక్షిత ప్రయాణాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదర్శవంతమైన గ్రామాలుగా నిలవాలంటే యువత మత్తు పదార్థాలు, గంజాయి, ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీసే తంబాకు, జర్దా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికయ్యే ఖర్చును పౌష్టికాహారం, ఆరోగ్యం కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బి.ఎల్.ఓలు జూన్ 24 లోగా 100% ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, జూన్ 25 నుండి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి పనులైన మిషన్ భో రథ పైప్‌లైన్ విస్తరణ, సిసి రోడ్లు, వైకుంఠ ధామాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నవంబర్ చివరి నాటికి 'గ్రామ సంఘం భవనం' నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, 'మన ఊరు – మన బడి' కింద పెండింగ్‌లో ఉన్న నిధులను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులలో నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'దాజుగా' స్కీమ్ కింద అర్హులైన ప్రతి ఎస్టీ (గా) కుటుంబానికి ఉచితంగా కరెంట్ మీటర్లు అందించాలని, గ్రామాల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను, లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో తీర్మానం చేశారు. ఈ గ్రామ సభ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ కట్కం సంజీవ్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, మండల విద్యా, వైద్య, వ్యవసాయ, విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.







మామిడి పల్లి లో హెల్త్ క్యాంపు మాజీ సొసైటీ చైర్మన్ నజీర్ పటేల్ ఆధ్వర్యంలో

సంగారెడ్డి జిల్లా నాయకుడు మండల పరిధిలోని మామిడిపల్లిలో, డాక్టర్ రెబ్కా ప్రియదర్శిని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ స్వాతి సిస్టర్ డాక్టర్ అనిత ఐ స్పెషలిస్ట్ సీనియర్ ఇవాంజెలిస్ట్ మనోహర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నజీర్ పటేల్ , పాస్టర్ శ్యామ్ లెమన్ మాణిక్యం, సంఘ పెద్దలు భూమయ్య లక్ష్మయ్య ఏసయ్య నరసయ్య అమృతు, పోశయ్య మొగులయ్య తదితరులు

# అనాథ బాలికలకు నేరుగా పాలిటెక్నిక్‌లలో ప్రవేశం

- జిల్లా సంక్షేమ అధికారి ఎల్.రాజేందర్ గౌడ్
- మహిళా శిశు సంక్షేమ శాఖ, నారాయణపేట జిల్లా

**నారాయణపేట, జూన్,06:** అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికలకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి (ఐఅర్‌తీఅష్ ఔవశ్రీట్ఘుతీవ వాటటఅషవతీ) ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ సీపీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ సర్వేయింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఫీజు, వసతి మరియు భోజన సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని తెలిపారు. దరఖాస్తుదారులు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం (అనాథలకు), హోమ్/హాస్టల్ బోనాఫైడ్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికేట్ మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో 08-06-2026 లోపు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, నారాయణపేటలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ం91 96031 59360 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా సంక్షేమ అధికారి శ్రీ ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు.

# పోచంపల్లి ఇక్కత్ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

- ప్రపంచ చిత్రపటంలో పోచంపల్లి ఇక్కత్ కు ప్రత్యేక స్థానం
- చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ అండ
- హైటెక్స్‌లో "త్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనలో మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి






**హైదరాబాద్ జూన్6( .:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న "త్రెడ్ పోచంపల్లి" ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూపోచంపల్లి ఇక్కత్ కేవలం ఒక వస్త్ర కళ మాత్రమే కాదని, అది తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సృజనాత్మకత, సంప్రదాయ జీవన విధానానికి అద్దం పట్టే అద్భుత కళారూపమని ఆయన అభివర్ణించారు. రంగుల సమన్వయం, నూలు పోగుల్లో కనిపించే అపూర్వమైన డిజైన్లు, తరతరాలుగా వస్తున్న కళాత్మక నైపుణ్యం వల్ల పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. చేనేత కార్మికుల కష్టం, పట్టుదల, నైపుణ్యం వల్లే పోచంపల్లి పేరు ప్రపంచ పటంలో నిలిచిందని మంత్రి కొనియాడారు. ఒక చీర తయారీ వెనుక కుటుంబమంతా కలిసి చేసే శ్రమ, సృజనాత్మకత, అంకితభావం దాగి ఉంటుందని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

పోచంపల్లి ఇక్కత్‌కు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ (+×) ట్యాగ్ తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిందని మంత్రి అన్నారు. పోచంపల్లి పేరు నేడు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో వినిపించడానికి కారణం చేనేత కార్మికుల ప్రతిభేనని కొనియాడారు. భారతదేశ చేనేత రంగ చరిత్రలో పోచంపల్లి ఇక్కత్‌కు ప్రత్యేక అధ్యాయం ఉందని పేర్కొన్న మంత్రి, ఈ కళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత కూడా చేనేత రంగం వైపు ఆకర్షితులయ్యేలా ఆధునిక డిజైన్లు, కొత్త మార్కెటింగ్ విధానాలు, డిజిటల్ వేదికల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. "త్రెడ్ పోచంపల్లి" వంటి ప్రదర్శనలు చేనేత కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, కొనుగోలుదారులు, డిజైనర్లు, వ్యాపారవేత్తలు, కళాభిమానులను ఒకే వేదికపైకి తీసుకువస్తాయని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా పోచంపల్లి ఇక్కత్‌కు మరింత ప్రాచుర్యం లభించి, చేనేత కార్మికుల ఆదాయం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, సంప్రదాయ కళల పరిరక్షణ విషయంలో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. "పోచంపల్లి ఇక్కత్ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే కళగా ఆయన అభివర్ణించారు. చేనేత కార్మికుల చెమట చుక్కలతో అల్లుకున్న ఈ కళాఖండం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



# బంగారం, వెండి కొనుగోలుదారులకు ఊరట

## పసిడి, వెండి ధరలు భారీగా తగ్గింపు

**హైదరాబాద్** : బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో దేశీయ బులియన్ మార్కెట్లో పసిడి, వెండి ధరలు తగ్గాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు మించి నమోదుకావడం, డాలర్ బలపడటం వంటి పరిణామాలతో విలువైన లోహాలపై ఒత్తిడి పెరిగింది. దీంతో ఇటీవల గరిష్ఠ స్థాయిల్లో ఉన్న ధరలు దిగివచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,000 తగ్గి రూ.1,52,730కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,750 తగ్గి రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.15,273 కాగా, 22 క్యారెట్ల గ్రాము ధర రూ.14,000గా ఉంది. 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.11,455గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లోనూ భారీ తగ్గుదల నమోదైంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.10,000 తగ్గి రూ.2,70,000కు చేరింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,65,000 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం, వెండి ధరలు తగ్గడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

# టీ-మొబైల్ ఎంట్రీతో జియోకు ముప్పు?

## హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు వెనుక అసలు కథ ఇదే

**హైదరాబాద్, జూన్ 6:** అమెరికాకు చెందిన ప్రముఖ టెలికాం సంస్థ టీ-మొబైల్ భారత్‌లో అడుగుపెట్టడంతో దేశీయ టెలికాం రంగంలో చర్చ మొదలైంది. జియో, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజాలకు కొత్త పోటీదారు రాబోతున్నాడనే ప్రచారం జరిగినప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. టీ-మొబైల్ తన తొలి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్ హైటెక్ సిటీలో ఏర్పాటు చేసింది. సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా సంస్థ తన గ్లోబల్ సాంకేతిక కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సంస్థ భారత టెలికాం మార్కెట్లో నేరుగా సేవలు అందించేందుకు లేదా మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదు. వినియోగదారులకు సిమ్ కార్డులు, మొబైల్ సేవలు లేదా ఇంటర్నెట్ ప్యాకేజీలు అందించే యోచన కూడా లేదని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు సాంకేతిక సామర్థ్యాలను విస్తరించుకోవడమే టీ-మొబైల్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో లభిస్తున్న నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఆధునిక సమాచార సాంకేతిక వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేంద్రం ద్వారా 2027 నాటికి సుమారు వెయ్యి మంది స్థానిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రకటించింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, సైబర్ భద్రత, డెవ్‌ఆప్స్, ఉత్పత్తి అభివృద్ధి, డేటా విశ్లేషణ వంటి కీలక విభాగాల్లో ఈ కేంద్రం పనిచేయనుంది. పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం, హైదరాబాద్ కేంద్రం పూర్తిగా అమెరికాలోని టీ-మొబైల్ కార్యకలాపాలకు సాంకేతిక మద్దతు అందించేందుకే పరిమితం కానుంది. భారతీయ టెలికాం మార్కెట్లో నేరుగా పోటీ పడే ఉద్దేశం ప్రస్తుతం సంస్థకు లేదు. దీంతో జియో, ఎయిర్‌టెల్ సంస్థలకు తక్షణ ముప్పు లేదని స్పష్టమవుతోంది. టెలికాం లైసెన్సులు లేదా స్పెక్ట్రమ్ వేలాల్లో పాల్గొనే ఆసక్తిని కూడా టీ-మొబైల్ ఇప్పటివరకు వ్యక్తం చేయలేదు. అయితే ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థ హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం నగరానికి, స్థానిక ఐటీ రంగానికి శుభపరిణామంగా పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# రూ.20 తక్కువకే ఇంధనం

## దేశంలో ఈ85 ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూన్ 6 :** పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ85 ఫ్లెక్స్ ఫ్యూయల్‌ను అధికారికంగా ప్రారంభించింది. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే లీటరుకు సుమారు రూ.20 తక్కువ ధరలో లభించే ఈ ఇంధనం పర్యావరణ హిత ప్రత్యామ్నాయంగా నిలవనుంది. భారత ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు హరిత ఇంధన వినియోగాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి న్యూఢిల్లీలోని *Indian Oil Corporation* పెట్రోల్ బంక్‌లో ఈ85 ఇంధనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12 ఉండగా, ఈ85 ధరను రూ.82.12గా నిర్ణయించారు. దీంతో వినియోగదారులకు లీటరుకు రూ.20 వరకు ఆదా కానుంది.




### ఈ85 అంటే ఏమిటి?

ఈ85 అనేది 80 నుంచి 85 శాతం ఇథనాల్, 15 నుంచి 20శాతం పెట్రోల్ మిశ్రమంతో తయారయ్యే ప్రత్యామ్నాయ ఇంధనం. ఇది ప్రత్యేకంగా ఫ్లెక్స్-ఫ్యూయల్ ఇంజిన్‌లు కలిగిన వాహనాల కోసం రూపొందించారు. ఈ వాహనాల్లోని అధునాతన ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ ఇంధనంలోని ఇథనాల్ శాతాన్ని గుర్తించి దానికి అనుగుణంగా ఇంజిన్ పనితీరును సర్దుబాటు చేస్తుంది. సాధారణ పెట్రోల్ వాహనాల్లో దీనిని ఉపయోగించలేరు. పెట్రోల్‌తో పోలిస్తే ఈ85 వాడకం ద్వారా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 61 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్ ఉత్పత్తి కావడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభించనుంది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన హరిత ఇంధన పరిష్కారంగా దీనిని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.

### మార్కెట్లోకి ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు

*Hero MotoCorp* ఇటీవల తన స్ప్లెండర్, హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ల ఫ్లెక్స్-ఫ్యూయల్ వెర్షన్లను పరిచయం చేసింది. అలాగే *Maruti Suzuki* వాగన్ ఆర్ ఫ్లెక్స్-ఫ్యూయల్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. భవిష్యత్తులో మరిన్ని వాహన తయారీ సంస్థలు ఈ విభాగంలోకి వచ్చే అవకాశం ఉంది.

### 5 వేల బంక్‌లకు విస్తరణ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 48 ప్రభుత్వ రంగ పెట్రోల్ బంక్‌లలో ఈ85 ఇంధనం అందుబాటులో ఉంది. డిసెంబర్ 2026 నాటికి 500 పెట్రోల్ బంక్‌లకు, డిసెంబర్ 2027 నాటికి 5 వేల బంక్‌లకు దీన్ని విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2030-31 నాటికి ఇథనాల్ మిశ్రమ లక్ష్యాలను చేరుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పర్యావరణ హిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# మళ్లీ పెరిగిన విదేశీ మారక నిల్వలు




**ముంబై, జూన్ 6:** భారతదేశ విదేశీ మారక నిల్వలు రెండు వారాల క్షీణత తర్వాత మళ్లీ పెరుగుదల నమోదు చేశాయి. రూపాయి మారక విలువను స్థిరంగా ఉంచేందుకు విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకున్నప్పటికీ, తాజా వారంలో నిల్వలు 938 మిలియన్ డాలర్లు పెరిగాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మే 29తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 938 మిలియన్ డాలర్లు పెరిగి 682.321 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో నిల్వలు 7.511 బిలియన్ డాలర్లు తగ్గాయి. ఫిబ్రవరి 27న విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్లతో సర్వకాలిక గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయి.

### విదేశీ కరెన్సీ ఆస్తుల్లో పెరుగుదల

మొత్తం విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 3.116 బిలియన్ డాలర్లు పెరిగి 546.148 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో ఈ విభాగంలో 2.872 బిలియన్ డాలర్ల తగ్గుదల నమోదైంది. డాలర్‌తో పాటు యూరో, బ్రిటిష్ పౌండ్, జపాన్ యెన్ మారక విలువల్లో వచ్చిన మార్పులు కూడా ఈ ఆస్తుల విలువపై ప్రభావం చూపుతాయి.

### బంగారు నిల్వల విలువ తగ్గింది

తాజా వారంలో బంగారం ధరలు తగ్గడంతో రిజర్వ్ బ్యాంక్ బంగారు నిల్వల విలువ కూడా క్షీణించింది. బంగారు నిల్వల విలువ 2.186 బిలియన్ డాలర్లు తగ్గి 112.600 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మార్చి చివరి నాటికి ఆర్‌బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వగా ఉంది. ఇది దేశ మొత్తం విదేశీ మారక నిల్వల్లో 16.7 శాతం వాటాను కలిగి ఉంది.

### ఎస్‌డీఆర్ నిల్వలు యథాతథం

అంతర్జాతీయ ద్రవ్య నిధి కేటాయించే స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ నిల్వల్లో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం అవి 18.747 బిలియన్ డాలర్లుగా కొనసాగుతున్నాయి. ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ పొజిషన్ మాత్రం 8 మిలియన్ డాలర్లు తగ్గి 4.826 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రెండు వారాల తగ్గుదల తర్వాత విదేశీ మారక నిల్వలు మళ్లీ పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. ఈ నిల్వలు దిగుమతుల చెల్లింపులు, రూపాయి మారక విలువ స్థిరీకరణ, ఆర్థిక భద్రతకు కీలక మద్దతుగా నిలుస్తాయని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

# 2060 నాటికి చైనాను అధిగమించనున్న భారత్?

## జీడీపీలో భారత వాటా పెరుగుతుందని అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 6 :** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ భారత్ ఆర్థిక వృద్ధిలో దూసుకుపోతోంది. తాజాగా దేశ ఆర్థిక వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదవగా, భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతుందని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక అసమానతలపై పరిశోధనలు నిర్వహిస్తున్న వరల్డ్ ఇనిక్వాలిటీ ల్యాబ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, కొనుగోలు శక్తి సమానత్వం ప్రాతిపదికన 2060 నాటికి ప్రపంచ జీడీపీలో భారత వాటా చైనాను అధిగమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ జీడీపీలో చైనా వాటా సుమారు 20 శాతంగా ఉన్నప్పటికీ, జనాభా తగ్గుదల ప్రభావంతో ఆ దేశ ఆర్థిక ప్రాధాన్యం క్రమంగా తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం 1945లో ప్రపంచ జనాభాలో చైనా వాటా 23 శాతం ఉండగా, 2025 నాటికి అది 17 శాతానికి తగ్గింది. 2100 నాటికి ఇది 8 శాతం కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. జనాభా క్షీణత కారణంగా చైనా ప్రపంచ జీడీపీలో వాటా ముందుగా స్థిరపడిన తర్వాత క్రమంగా తగ్గుతుందని, 2060 ప్రాంతంలో భారత్ దానిని అధిగమించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. భారీ జనాభా, విస్తరిస్తున్న వినియోగ మార్కెట్, సేవల రంగం వృద్ధి, ఆర్థిక విస్తరణ వంటి అంశాలు దీర్ఘకాలంలో భారత్‌కు అనుకూలంగా మారనున్నాయి. అయితే చైనాతో పోలిస్తే భారత్‌లో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉండటంతో పాటు ఉత్పాదకత వృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది.



21వ శతాబ్దంలో ప్రపంచం ఒకే దేశ ఆధిపత్యంలో కాకుండా బహుళ ధ్రువ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని నివేదిక అంచనా వేసింది. గతంలో అమెరికా, యూరప్ ప్రపంచ జీడీపీలో భారీ వాటాతో ఆధిపత్యం చెలాయించినప్పటికీ, భవిష్యత్తులో ఏ ఒక్క దేశం కూడా ఆ స్థాయిలో ఆధిపత్యం సాధించే అవకాశాలు తక్కువగా ఉంటాయని విశ్లేషించింది. ప్రపంచ ఆర్థిక దృక్పథం అంచనాల ప్రకారం 2026లో అమెరికా జీడీపీ 32.38 ట్రిలియన్ డాలర్లు, చైనా జీడీపీ 20.85 ట్రిలియన్ డాలర్లు, జపాన్ జీడీపీ 4.38 ట్రిలియన్ డాలర్లు, యూకే జీడీపీ 4.27 ట్రిలియన్ డాలర్లు, భారత్ జీడీపీ 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరనున్నాయి. 2025లో 3.92 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీడీపీ 2026లో 4.15 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కొనుగోలు శక్తి సమానత్వం అనేది ఒక దేశ ప్రజలు తమ కరెన్సీతో కొనుగోలు చేయగల వస్తువులు, సేవల పరిమాణాన్ని మరో దేశంతో పోల్చే ప్రమాణం. సాధారణ జీడీపీ కంటే ప్రజల వాస్తవ కొనుగోలు శక్తిని అంచనా వేయడంలో ఇది కీలకంగా పరిగణిస్తారు.

# భారీ స్కోరు దిశగా భారత్!

## అఫ్ఘాన్‌తో భారత్ ఏకైక టెస్టు.. రాహుల్, గిల్ సెంచరీల మోత..



అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసే సరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్ఘాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కును చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

# టెస్టు క్రికెట్ మ్యాచ్ మధ్యలో పింక్ బాల్..



రానున్న రోజుల్లో టెస్టు క్రికెట్‌లో ఐసీసీ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టనుంది. కొన్ని కొన్ని సార్లు బ్యాడ్ లైట్ కారణంగా ఆ రోజులో వేయాల్సిన ఓవర్లు ఉన్నా మ్యాచ్‌ని ముందుగానే ముగిస్తుంటాం. ఇకపై ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు పింక్ బాల్‌ని ఉపయోగించేలా ఐసీసీ కొత్త రూల్ తీసుకొస్తోంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించాడు. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్ అమలులోకి రానుంది. ఐసీసీ తాజాగా క్రికెట్‌లో కొత్త నిబంధన తీసుకొచ్చింది. టెస్టు క్రికెట్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఆటకు అంతరాయం కలిగినప్పుడు పింక్ బాల్‌ను ఉపయోగించాలని అని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. ఈ కొత్త నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. ఇటీవల జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో సాధారణ టెస్టు మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు ఆమోదం లభించింది. మ్యాచ్ ఎప్పటిలాగా రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతుంది. ఒకవేళ మ్యాచ్ మధ్యలో బ్యాడ్ లైట్ కారణంగా ముందుగా దేని ముగించాల్సి ఉన్న సందర్భంలో పింక్ బాల్‌తో మిగిలిన ఓవర్లు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఈ నిర్ణయం తనకు బాగా నచ్చిందని గౌతమ్ గంభీర్ అన్నాడు. "నాకు ఈ నిర్ణయం చాలా నచ్చింది. ఎందుకంటే మ్యాచ్‌కు ఫలితం వచ్చే అవకాశం ఉంటే దాన్ని ఎప్పుడూ కోల్పోకూడదని నేను నమ్ముతాను" అని చెప్పాడు. భారత్ 2027 ఫిబ్రవరి – మార్చిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ ఆడనుంది. ఇందులో గువాహటి, రాంచీలో టెస్టులు జరగనున్నాయి. అక్కడ సాయంత్రం 4 గంటలకే చీకటి పడే అవకాశం ఉంటుంది. దీంతో ఓవర్లు కోల్పోయే పరిస్థితి రావొచ్చు. ఇదే విషయాన్ని గంభీర్ కూడా స్పష్టం చేశాడు. "వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించే చివరి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారని ఊహించుకోండి. మీరు గెలవాల్సిన మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఫలితం రాకపోతే ఎంత నిరాశగా ఉంటుంది. రెండు జట్లు అగ్రీ కరిస్తే ఫలితం కోసం పింక్ బాల్ వేయడాన్ని నేను పూర్తిగా సపోర్ట్ చేస్తాను" అని గంభీర్ అన్నాడు. అయితే, ఒకే మ్యాచ్‌లో రెండ్ బాల్ నుంచి పింక్ బాల్‌కి మారడం కూడా ఆటగాళ్లకు సవాలుగా మారొచ్చని గంభీర్ అగ్రీ కరించాడు. ఐదు రోజుల టెస్టు మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్ సరిగ్గా జరగకపోతే అప్పుడు రెండు జట్లు బాధపడాల్సి వస్తుంది. దానికోసమే ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నట్లు గంభీర్ చెప్పాడు.



# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్ సూర్యవంశీ

ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు. 15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.

# రోహిత్ మళ్లీ అద్భుతాలు సృష్టిస్తాడు

### కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్

ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్, ఫిట్‌నెస్ పై వస్తున్న విమర్శలకు అతడి చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. శుక్రవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దినేష్ లాడ్ మాట్లాడుతూ, రోహిత్ ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇండియాకు వన్డే వరల్డ్ కప్ గెలిపించాలనే పట్టుదల రోహిత్ ను ఇంకా మోటివేట్ చేస్తోందని అన్నాడు. వన్డే క్రికెట్ లో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ రోహిత్ అని, 2019 వరల్డ్ కప్ లో ఐదు సెంచరీలు చేసిన రికార్డు అతడికి ఉందని గుర్తు చేశాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో మాత్రం ఇండియాను ఫైనల్స్ కు చేర్చడానికి తన ఎక్స్ పీరియన్స్ తో హెల్ప్ అవుతాడని చెప్పాడు. రోహిత్ శర్మ రాబోయే ఆరు నెలల్లో తన ఫిట్‌నెస్, బ్యాటింగ్ ఫామ్ ను నిరూపించుకుంటేనే 2027 వన్డే వరల్డ్ కప్ సెలెక్షన్ ప్లాన్స్ లో ఉంటాడని మాజీ సెలెక్టర్ సబా కరీం చేసిన కామెంట్స్ పై దినేష్ లాడ్ మండిపడ్డాడు. ఆరు నెలల టైమ్ అనేది ఒక్క రోహిత్ కే కాదు, టీమ్ లోని ప్రతి ప్లేయర్ కు ఇంపార్టెంట్ అని అన్నాడు. రోహిత్ 2027 వరల్డ్ కప్ కచ్చితంగా ఆడతాడని తనకు 100 పర్సెంట్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశాడు. రోహిత్ ఖాళీగా ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయడం లేదని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తూ తన ఫిట్‌నెస్ పై వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో మూడు ఇన్నింగ్స్ లో 61 రన్స్ మాత్రమే చేయడంతో రోహిత్ పై విమర్శలు పెరిగాయి. అయితే రోహిత్ టెక్నిక్ పరంగా ఎలాంటి ప్రాబ్లం లేదని లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్ లో కాసేపు క్రీజులో సెటిల్ అవ్వడం ముఖ్యమని, రోహిత్ కు ఆ టెక్నిక్ బాగా తెలుసని చెప్పాడు. రీసెంట్ ఐపీఎల్ లో కూడా కేవలం బిగ్ షాట్స్ మాత్రమే కాకుండా సింగిల్స్, డబుల్స్ తీస్తూ రోహిత్ తన క్లాస్ టెక్నిక్ ను చూపించాడని గుర్తు చేశాడు. విమర్శకులు ఏదేదో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నాడు. రోహిత్ శర్మకు తన కెరీర్ లోని ఈ కీలక ఫేజ్ లో లాడ్ ఒక ముఖ్యమైన అడ్వైజ్ ఇచ్చాడు. క్రీజులో కాసేపు నిలబడి సెటిల్ అయితే రోహిత్ ఎంత డేంజరస్ ప్లేయరో అందరికీ తెలుసని అన్నాడు. 2019 వరల్డ్ కప్ లో ఎలా ఆడాడో రోహిత్ మరోసారి గుర్తు తెచ్చుకొని అలాగే ఆడాలని కోరాడు.




# నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్లసన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్‌ను ఒకే టోర్నమెంట్‌లో రెండుసార్లు క్లాసికల్ చెస్‌లో ఓడించిన రెండో భారతీయ ఆటగాడిగా (విశ్వనాథన్ ఆనంద్ తర్వాత) ప్రజ్ఞానంద అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా లైవ్ రేటింగ్స్‌లో ఆయన ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానానికి ఎగబాకారు.

## భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగానే శ్రేయస్‌కు బాధ్యతలు

### చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను జట్టు నుంచి పూర్తిగా తొలగించడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ శనివారం కీలక వివరణ ఇచ్చారు. మూడు నెలల క్రితమే దేశానికి టీ20 ప్రపంచకప్ అందించి, ఎంఎస్ ధోని, రోహిత్ శర్మల సరసన నిలిచిన కెప్టెన్‌ను పక్కన పెట్టడం సులువైన నిర్ణయం కాదని ఆయన అగ్రీ కరించారు. అయితే ఒక మెగా టోర్నీ ముగిసిన తర్వాత భవిష్యత్తు ప్రణాళికలను పునఃసమీక్షించుకోవడం సహజమని పేర్కొన్నారు. సూర్యకుమార్ వ్యక్తిగత ఫామ్ క్షీణించడం, అదే సమయంలో రాబోయే రెండేళ్ల ప్రపంచకప్ సైకిల్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు మేనేజ్‌మెంట్ ఈ కఠిన నిర్ణయం తీసుకుందని అగార్కర్ స్పష్టం చేశారు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించడమే సరైన మార్గమని సెలెక్షన్ కమిటీ భావించింది. ఐపీఎల్ టోర్నీలలో వేర్వేరు జట్లను విజయవంతంగా నడిపించిన అపారమైన నాయకత్వ అనుభవం శ్రేయస్ అయ్యర్‌కు ఉందని అగార్కర్ కొనియాడారు. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన అయ్యర్, ఆ తర్వాతి సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను రన్నరప్‌గా నిలబెట్టారు. ప్రస్తుత 2026 ఐపీఎల్ సీజన్ ప్రారంభంలో పంజాబ్ జట్టును వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నడిపించి, కేవలం ఒక్క పాయింట్ తేడాతో ప్లేఆఫ్స్ అవకాశాన్ని కోల్పోయారు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఆయన నిరూపించుకున్నారు. నాయకత్వ బాధ్యతలతో పాటు బ్యాటర్‌గా కూడా అయ్యర్ స్థిరమైన ప్రదర్శన చేయడం సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంది. గత ప్రపంచకప్ జట్టు ఎంపిక సమయంలోనే శ్రేయస్ అయ్యర్ రేసులో నిలిచారని, అయితే అప్పట్లో సూర్యకుమార్ జట్టులో ఉండటం వల్ల ఆయనకు చోటు దక్కలేదని అగార్కర్ వెల్లడించారు. టీ20 ఫార్మాట్‌లో కెప్టెన్‌గా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న అయ్యర్, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టును నడిపించడానికి పూర్తి అర్హుడని కమిటీ నమ్మింది. ప్రపంచకప్ ముగిసిన వెంటనే జట్టును సరికొత్తగా పునర్వ్యవస్థీకరించడంలో భాగంగానే ఈ మార్పులు జరిగాయి. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో శ్రేయస్ అయ్యర్ సరికొత్త వ్యూహాలతో భారత జట్టును ముందుకు నడిపించనున్నారు.





# జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



# కాక్‌టెయిల్-2లో నటించడానికి భయపడ్డా

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

# 200 కోట్ల క్లబ్‌కు చేరువగా..

## పెద్ది వసూళ్లపై ట్రేడ్ వర్గాలు సైతం ఆశ్చర్యం

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా విడుదలైన తొలి షో నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పుడు కలెక్షన్ల పరంగా కూడా తన సత్తా చాటుతోంది. వర్కింగ్ డేస్‌లో విడుదలైనప్పటికీ 'పెద్ది' సాధిస్తున్న వసూళ్లు ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. మొదటి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన ఈ సినిమా, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించడం విశేషంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైన 'పెద్ది' మొదటి రోజే రూ.130 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లోనే అతిపెద్ద ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా సినిమాకు మంచి ఆదరణ లభించింది. ప్రత్యేకంగా నార్త్ అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో 'పెద్ది' ప్రీమియర్ షోలు మరియు తొలి రోజు వసూళ్లు అద్భుతంగా నమోదయ్యాయి. దీంతో సినిమా మొదటి రోజే బ్లాక్‌బస్టర్ దిశగా అడుగులు వేసింది. సాధారణంగా భారీ సినిమాలకు మొదటి రోజు తర్వాత వసూళ్లు కొంత తగ్గడం సహజం. అయితే 'పెద్ది' విషయంలో అలాంటి పరిస్థితి కనిపించలేదు. రెండో రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా మరో రూ.50 కోట్ల గ్రాస్‌ను ఈ చిత్రం రాబట్టినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీంతో కేవలం రెండు రోజుల్లోనే సినిమా మొత్తం రూ.181.8 కోట్ల గ్రాస్ వసూళ్లను అందుకుని మరో అరుదైన మైలురాయిని చేరుకుంది.




# రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు

## హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్



రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు. రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.




# విమర్శలనూ సృజనాత్మకంగా చూడాలి

### అనసూయా భరద్వాజ్

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com